క్లుప్తంగా

అన్నదమ్ముల ఘర్షణ.. కేసు నమోదు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలో అస్తి విషయంలో కంచర్ల వీరనారాయణ, కంచర్ల మురళి అనే అన్నదమ్ముళ్లు ఇద్దరు అస్తి తగదాల్లో గురువారం సాయంత్రం ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అన్న కంచర్ల మురళితో పాటు భార్య, కుమారులు కలిసి తమ్ముడైన కంచర్ల వీరనారాయణ తలపై బలంగా కొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. వీరనారాయణ గాయాలతోనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఆ సమయంలో ఏఎస్‌ఐ ఆదిశేషయ్య క్షతగాత్రుడిని పరిశీలించి వెంటనే గిద్దలూరు ఏరియా వైద్యశాలకు పంపించారు. శుక్రవారం ఉదయం వీరనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.కృష్ణపావని తెలిపారు.

దివ్యాంగులను ఆదుకుంటున్న ప్రభుత్వం



యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులను అన్ని విధాలా ఆదుకుంటోందని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఆయన ఎంఆర్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు విద్యార్థులు భారం కాకుండా వారికి ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్ వినికిడి యంత్రాలు, చదువు సులభంగా నేర్చుకునేందుకు మేజిక్ స్లేట్స్, బొమ్మల చార్టులు, ఆటవస్తువులు అందచేస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతిలో మండలంలో ప్రథమ స్థానం సాధించిన మానసిక దివ్యాంగ విద్యార్థి కె.వెంకటేష్‌ను శాలువా కప్పి సన్మానించారు. హెచ్‌ఎం వి.పిచ్చిరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు షేక్ సాధిక్, ఉపాధ్యాయులు నాగరాణి, ముర్తుజావలి పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ ట్యాంకులు బహూకరణ

తర్లుపాడు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగిశెట్టి కిరణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మండలంలోని లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి కోసం రెండు స్టీల్ వాటర్ ట్యాంకులు బహూకరించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, స్వీట్లు పంచిపెట్టారు. దాత కిరణ్ కుమార్‌ను హెచ్‌ఎం కస్సెట్టి జగన్‌బాబు అభినందించారు. వాసవీ క్లబ్ సభ్యులు వెలుగూరి వెంకటేశ్వర్లు, గుర్రం రామారావు, పోలేపల్లి వెంకట లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ షుకూర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మార్కాపురం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో పేదలకు దుప్పట్లు, చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

పేదల సొంతింటి కల జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్
- వేముల జగనన్న కాలనీలో గృహాలు ప్రారంభం



జగనన్న కాలనీలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ముండ్లమూరు: పేదల సొంతింటి కల నెరవేర్చడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని వేముల గ్రామంలో జగనన్న కాలనీలో శుక్రవారం గృహప్రవేశాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఇళ్ల నిర్మాణానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా సీఎం వైఎస్ జగన్ వాటిని అధిగమించారన్నారు. పేదలకు అండగా ఉంటూనే అర్హులైన అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మొదటిసారి జగనన్న కాలనీలను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంకా ఎవరికైనా ఇళ్లు, ఇంటి స్థలం కావాలంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా గ్రామస్తులు మేళతాళాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, సన్మానించారు.

పేదలకు వరం ఓటీఎస్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఓటీఎస్ పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. వేములలో శుక్రవారం ఓటీఎస్ లబ్ధిదారులు 93 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి పట్టాలు మంజూరు చేసి శాశ్వతంగా హక్కు కల్పించడం అనేది రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. పేదల పక్షపాతిగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సుంకర సునీత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మేడికొండ జయంతి, సొసైటీ అధ్యక్షుడు కుమ్మిత వెంకటరెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, నాయకులు రామ మునలారెడ్డి, మోషిరెడ్డి, అంబటి వెంకటేశ్వరరెడ్డి, సందయ్య, బచ్చు గురవారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, కుమ్మిత శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి, అన్నపురెడ్డి రమణారెడ్డి, పాలెపోగు డగ్లస్, భిక్షాలురెడ్డి, సర్పంచ్‌లు జమ్ముల గురవయ్య, జనమాల నాగేంద్రంపిచ్చయ్య, అంబటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య నిర్దేశం, సాధనతో విజయం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

పొదిలి: ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని, దాని సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేసినపుడు విజయం వరిస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవివేకానంద కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు సూచనలిచ్చారు. ఇంటర్ తరువాత ఉపాధి, ఉద్యోగాలు పొందే పలు కోర్సులకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఆయా కోర్సుల్లో పూర్తి స్థాయి మార్పులు జరిగాయన్నారు. విద్యారంగానినికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అందరికీ ఉన్నత చదువులు అందుబాటులో ఉండటం వల్ల పోటీ ప్రపంచంలో విజయం సాధించేందుకు పేద విద్యార్థులకు అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

- ఎంపీపీ మురళీకృష్ణయాదవ్



రెవెన్యూ అధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ ఏడుకొండలు

కొనకనమిట్ల: ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందిస్తూ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, విద్య, వైద్యం, హౌసింగ్, ఉపాధి, వైఎస్సార్ క్రాంతి పథం, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని ఆయా శాఖల అధికారులు ప్రసన్న రంగలక్ష్మి, డాక్టర్ పృథ్వీరాజ్, దాంగేషరీఫ్, బుల్లెన్న, గోపాలకృష్ణారెడ్డి, సుభాషిణి వివరించారు.

సమస్యలపై వాడీవేడి చర్చ

పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా ఉంటున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. గత సమావేశంలో సభ్యులు వెల్లడించిన సమస్యలు ఎన్ని పరిష్కరించారో చెప్పాలని జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు ప్రశ్నించారు. రెవెన్యూ, నాడు-నేడు పనులు, విద్యా శాఖ, విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బచ్చలకూరపాడు, చినారికట్ల జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలు దరఖాస్తు చేసుకుంటే ఎందుకు పట్టాలు ఇవ్వలేదని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. వాగుమడుగులో నిబంధనల ప్రకారం గ్రామ సచివాలయం, ఆర్బీకే పూర్తి చేసినా పీఆర్ ఏఈ బిల్లులు పెట్టడం లేదని ఎంపీటీసీ కృష్ణవేణి కోటయ్య సమావేశం దృష్టికి తెచ్చారు. పొదిలి ఆర్టీసీ డిపో నుంచి గొట్లగట్టు కాట్రగుంట, తువ్వపాడు మీదుగా కొనకనమిట్ల వరకు ఆర్టీసీ బస్‌లు నడపాలని సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, ఇన్‌చార్జి ఎంపీడీఓ రావూరి జనార్దన్, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముస్లింల మద్దతు వైఎస్సార్ సీపీకే..

- దర్శి ఏఎంసీ చైర్మన్‌గా తొలిసారి ముస్లిం మహిళకు అవకాశం
- హర్షం వ్యక్తం చేసిన ముస్లిం మైనారిటీ నాయకులు



సీఎం జగన్, ఎమ్మెల్యే మద్దిశెట్టి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ముస్లిం నాయకులు

దర్శి: దర్శి ఏఎంసీ చైర్మన్‌గా తొలిసారి ముస్లిం మహిళకు అవకాశం కల్పించడంపై ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని, ముస్లింల మద్దతు పార్టీకి ఎలపుడూ ఉంటుందని షేక్ అమీన్‌బాషా(మిల్లర్ బుజ్జి), ఖాసిం బ్రదర్స్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లోని మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ మస్తాన్‌వలి, షేక్ బాబు, షేక్ ఖాదర్‌భాషా, షేక్ దర్బార్, షేక్ ఖాశీం, ఎస్‌కే మాలిక్‌బాషా, షేక్ షమీర్, షేక్ మస్తాన్, షేక్ కరిముల్లా, షేక్ ఖాశీంసాహెబ్, షేక్ ఈసుబ్‌వలి, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణ సేవలు అభినందనీయం



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మండలంలోని మఠ్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మునగాల జయకృష్ణ తన సొంత ఖర్చులతో ఏకరూప దుస్తులు ఇవ్వడం అభినందనీయమని ఎంఈఓలు ఎస్‌కే దాంగే షరీఫ్, నరసింహారావు అన్నారు. శుక్రవారం విద్యార్థులకు జయకృష్ణ అందజేసిన తెలుపు రంగు ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్య రమేష్, రామాంజనేయులు, ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, నారాయణ, రామయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ సర్పంచ్



జాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలం మిరియంపల్లె మాజీ సర్పంచ్ బొందలపాటి జాన్ శుక్రవారం రాత్రి తన అనుయాయులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మిరియంపల్లిలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జాన్ నివాస గృహం వద్దకు చేరారు. అక్కడ తన అనుయాయులతో వేచి ఉన్న టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ జాన్ మంత్రికి స్వాగతం పలికి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయనకు పార్టీ కండువా కప్పి మంత్రి స్వాగతించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగేవారే లేరని, ఆ పథకాలు అర్హులైనవారికి కాకుండా టీడీపీ కండువాలు కప్పుకున్న పలుకుబడి ఉన్నవారికి మాత్రమే అందేవన్నారు.

పేదలను దృష్టిలో పెట్టుకొని నవరత్నాలను అమలు పరుస్తూ ఆ పథకాలు అందుతున్నాయా, ఇంకా ఏం కావాలని తెలుసుకునేందుకు మంత్రినే తమ ఇళ్లకు పంపిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని జాన్ పేర్కొన్నారు.

ఖుర్షీద్ బేగం కథలు మేల్కొలుపు కావాలి

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ఖుర్షీద్ బేగం రాసిన కథలు మేల్కొలుపు కావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఖుర్షీద్ బేగం రచించిన అడుగుజాడలు (ఇస్లాంవాద కథలు) అనే పుస్తకాన్ని శుక్రవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో ఆమె రాసిన కథలు నైతిక విలువలు, హిందూ, ముస్లింల మధ్య స్నేహం, ప్రేమ, సోదర భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సమాజ మార్పుకు దోహదపడే రచనలను గౌరవించాలని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా పాల్గొన్నారు.

దర్శి ఏఎంసీ చైర్మన్‌గా షకీలా



దర్శి: దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా షేక్ షకీలాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా కందె గంగయ్య, సభ్యులుగా భవనం మురళీకృష్ణారెడ్డి, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నరసమ్మ, అడ్డగిరి వెంకటనారాయణ, అడుసుమల్లి రాజ్యం, శాగం రోశమ్మ, లవనూరి సుబ్బులు, షేక్ రసూల్‌బాషా, దాసరి ఏలియా, ముక్తిపూడి జెమీమా, దేవరకొండ వెంకటేశ్వర్లు, గంజి వెంకటేశ్వరరెడ్డి, షేక్ నసీమా నియమితులయ్యారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ హానరీ చైర్మన్‌గా, మెంబర్లుగా పీఏసీఎస్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, జిల్లా ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, అగ్రికల్చర్ డైరెక్టర్, నగర పంచాయతీ చైర్మన్ కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు



ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

మార్కాపురం టౌన్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వాయినాలు ఇచ్చుకుని మొదటి శుక్రవారాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకుడు అరుణ్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గిద్దలూరు రూరల్: శ్రావణమాసం సందర్భంగా మొదటి శుక్రవారం రోజు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారి మూలవిరాట్ మూర్తి అమ్మవారిని లక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఉయ్యాల మండపంలోని అమ్మవారికి ఊయల సేలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గడప గడపకూ తాగునీరు

తర్లుపాడు: మండలంలోని ప్రతి గడపకూ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ పీపీ కౌన్సిల్ సభ్యులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కేతగుడిపి ఎస్సీ కాలనీలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందించే పనులకు సర్పంచ్ పెద్ద మస్తాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. బుడ్డపల్లిలో జల్ జీవన్ మిషన్ పనులు పూర్తవడంతో సర్పంచ్, స్థానిక నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి గోపీకృష్ణ, సచివాలయ సిబ్బంది, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ప్రోగ్రాం

కొనకనమిట్ల: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్థాపించిన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు దాంగే షరీఫ్, నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగంలో 6, 7, 8వ తరగతి విద్యార్థులు, సీనియర్ విభాగంలో 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాచ రచన, ఫోక్ డ్యాన్స్, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులను తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులను కోరారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

రాచర్ల: పంచాయతీ వార్డు ఎన్నికల సందర్భంగా ఎవరైనా అకారణంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ జి.కృష్ణపావని హెచ్చరించారు. మండల కేంద్రం రాచర్ల గ్రామంలోని 6వ వార్డు ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ఎన్నికల సందర్భంగా ప్రశాంతంగా ఎవరి ఓటు వారు వినియోగించుకోవాలన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ముండ్లమూరు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ విజయభారతిరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌పై ఆరా తీశారు. వినియోగదారుల సేవల లాగిన్‌ను తనిఖీ చేశారు. పెద ఉల్లగల్లులో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ముండ్లమూరులో సెక్షన్ ఆఫీసు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ ఎస్‌డీ కరీం, కార్పొరేషన్ ఆఫీసర్ వసంతరావు, డీఈఈ కె.పిచ్చయ్య, ఏఈలు కృష్ణారెడ్డి, ఇమ్మానియేలుబాబు, వేణుగోపాల్, సుబ్బారెడ్డి, సిబ్బంది ఆంజనేయులు, సాంబయ్య, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మహనీయుడు సర్దార్ పాపన్న గౌడ్



పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం: పేదల అభ్యున్నతి, సమసమాజ స్థాపన కోసం ప్రాణాలను పణంగా పెట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘ అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, డి.లక్ష్మయ్య కొనియాడారు. శుక్రవారం సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతిని సంఘ గౌరవ అధ్యక్షుడు రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక సాయితేజ నేత్ర వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఒక సామాన్య కల్లుగీత కార్మికుల కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్ మొగలుల పెత్తనాన్ని ధిక్కరించి ఔరంగజేబుకే ముచ్చెమటలు పోయించిన పోరాట యోధుడన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు బత్తిన శ్రీనివాసరావు, కంచర్ల చెన్నకృష్ణ, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత

- డీఆర్‌డీఏ పీడీ రవికుమార్



మాట్లాడుతున్న పీడీ రవికుమార్

కొనకనమిట్ల: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రభుత్వం వారికి అన్ని విధాలా చేయూత ఇస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చౌటపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాబు టెంట్ సప్లయర్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీం కింద వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజి ద్వారా రూ.5 లక్షల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. కొనకనమిట్ల బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న సంఘాలకు బ్యాంక్ ద్వారా మరింత ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, బ్యాంక్ లింకేజ్ యాంకర్ పర్సన్ సుబ్బారావు, ఐబీడీపీఎం కృపారావు, ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సీసీలు ఎజ్రా, రామయ్య, రాజయ్య, వీఓఏలు, పొదుపు గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి రాయితీ రుణాలు

ముండ్లమూరు: గ్రామాల్లో వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారికి 35 శాతం రాయితీతో బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రజనీకాంత్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం గ్రామ సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార నిర్వహణ కోసం రూ.2 లక్షలకు పైగా రుణం అవసరమైతే పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ పథకాల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నేరుగా వైఎస్సార్ కేపీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మహిళలను చైతన్యపరిచి అమూల్ పాల కేంద్రాలను బలోపేతం చేయాలని సిబ్బందికి సూచించారు. అమూల్ రాకతోనే పాల ధర పెరిగిందనే విషయంపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో అమూల్ ఏపీఎం సుబ్బారావు, దర్శి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, ఏపీఎం హనుమంతరావు, సిబ్బంది, వీఓలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని ఆకవీడులో శనివారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.